## క్లుప్తంగా

### అన్నదానానికి రూ.1.25 లక్షల విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడ ప్రసాదంపాడు ప్రాంతానికి చెందిన కొల్రపాటి లక్ష్మీభాయమ్మ రూ.1.25 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు మొత్తాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

### నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



పెనుగంచిప్రోలు: గ్రామంలోని బైపాస్ రోడ్డులో ఉన్న విద్యుత్‌లైన్‌ను ఆశాఖ అధికారులు ఆధునీకరిస్తున్నారు. పాత విద్యుత్ స్థంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈసందర్భంగా ఏఈ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గతంలో ఇనుప స్తంభాలు, చిన్న స్తంభాలు ఇబ్బందిగా ఉండటంతో వాటిస్థానంలో 27 సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న స్థంభాల ఎత్తు కూడా గతంలో వాటికంటే అధికంగా ఉండి ఎటువంటి ప్రమాదాలకు తావు లేకుండా ఉంటుందని వివరించారు.

### మత్స్యకారుల సంక్షేమానికి కృషి

విప్ ఉదయభాను



జగ్గయ్యపేట: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. పట్టణంలోని ఊరచెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను గురువారం ఆయన వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మత్స్యశాఖకు సంబంధించి రాష్ట్రంలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు ఒక ప్రత్యేకస్థానం ఉందన్నారు. జిల్లాలో విస్తారమైన సముద్రతీరంతోపాటు చెరువుల ద్వారా మత్స్యసంపద దిగుబడులు ఏటా భారీస్థాయిలో పెరుగుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం సబ్సిడీపై పడవలు, వలలు పంపిణీ చేస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఫిష్ ఆంధ్రా పేరిట షాపులను కూడా ఏర్పాటు చేసి ఆరోగ్యకరమైన చేపలను అందిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపల చెరువులను అభివృద్ధి చేయడంతోపాటు సొసైటీలుగా ఏర్పాటు చేసి చేప పిల్లలను ఉచితంగా అందజేస్తూ మత్స్యసంపద వృద్ధికి తగుచర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా మత్స్యశాఖాధికారి వి.పెద్దిబాబు మాట్లాడుతూ జగ్గయ్యపేటతోపాటు అనుమంచిపల్లి, బూచవరం, కన్నెవీడు, వత్సవాయి, నవాబుపేట గ్రామాల్లోని చెరువుల్లో 3.45లక్షల చేప పిల్లలను వదిలిపెట్టినట్లు చెప్పారు. ఈ చేప పిల్లల పర్యవేక్షణ అంతా ఆయా చేపల సొసైటీల సభ్యులు చూస్తారని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్, కేడీసీసీ బ్యాంక్ మాజీచైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఏడీ ఎస్.చక్రపాణి, ఏఐఎఫ్ లెనిన్‌బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ గోపి పాల్గొన్నారు.

# ముస్లింల ఆత్మగౌరవం పెంచింది జగనన్నే

ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధితోపాటు రాజకీయంగా ఉపముఖ్యమంత్రి పదవి, అనేక రాష్ట్రస్థాయి పదవులను కేటాయించి వారి ఆత్మగౌరవం పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజాద్‌బాషా పేర్కొన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డు పుట్టబజారులో రూ.75లక్షల నిధులతో చేపట్టిన షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో కలిసి గురువారం రాత్రి ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ ముస్లింలు అంటే విశ్వాసానికి మారుపేరు అన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు చేసిన మేలును ప్రతి ముస్లిం గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు. దశాబ్దాలుగా దారిద్ర్యరేఖకు దిగువన ఉండి అభివృద్ధి, అక్షరాస్యతకు నోచుకోని ముస్లింల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజ శేఖరరెడ్డి నాలుగుశాతం రిజర్వేషన్లు కల్పించడంతో ఎంతోమంది ముస్లింలు ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకుంటున్నారన్నారు. ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసుకుని ఏటా రాష్ట్రంలో 200మంది ముస్లింలు డాక్టర్లవుతున్నారన్నారు. వైఎస్ బాటలోనే ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పయనిస్తూ ముస్లింలకు చట్టసభల్లో, నామినేటెడ్ పోస్టుల్లో పెద్దపీట వేసి వారి ఆత్మగౌరవాన్ని పెంచారని తెలిపారు. సీఎం జగనన్న రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకువచ్చి దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపారన్నారు. గత చంద్రబాబు పాలనలో ముస్లింలను పట్టించుకున్న పాపాన పోలేదని, మైనార్టీశాఖను కూడా ముస్లింలకు ఇవ్వకుండా తనవద్దే ఉంచుకుని ముస్లింల ద్రోహిగా చంద్రబాబు నిలిచారని విమర్శించారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ముస్లింల సంక్షేమానికి రూ 2,650 కోట్లు కేటాయించగా, సీఎం జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో రూ.23,176 కోట్లు కేటాయించారని గుర్తుచేశారు. సీఎం జగనన్న తన తన కేబినేట్‌లో ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి, శాసనసభకు నలుగురు, శాసనమండలికి నలుగురు ముస్లింలు ఎన్నికయ్యేలా చేయడంతోపాటు 12మందికి రాష్ట్రస్థాయి పదవులు కట్టబెట్టారని కొనియాడారు. షాదీఖానా నిర్మాణానికి కొంతమంది అడ్డుపడినప్పటికి స్థలం, నిర్మాణ నిధులు కలిపి రూ.7 కోట్ల విలువతో షాదీఖానాను నిర్మించేందుకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను ముందుకు రావడం సాహసోపేత నిర్ణయమంటూ ఆయనను అభినందించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, విప్ సామినేని ఉదయభాను తదితరులు



ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఉదయభానులను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



హాజరైన ముస్లింలు, వైఎస్సార్‌సీపీ నాయకులు

**నేతలకు ఘనసత్కారం**

జగ్గయ్యపేట : వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖమంత్రి అంజాద్‌బాషా, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానులను గురువారం ఘనంగా సత్కరించారు. గజమాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ముస్లిం మైనార్టీ నియోజకవర్గ, పట్టణ అధ్యక్షులు షేక్ రస్‌హుస్సేన్, షేక్ మొహిద్దీన్, షాదీఖానా ప్రెసిడెంట్ ఎక్బైడ్ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, కేడీసీసీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు రంగాపురం రాఘవేంద్ర, తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, జామియా మసీదు ప్రెసిడెంట్ జలీల్, దర్గా ప్రెసిడెంట్ ఖాజా, బాలసైదా, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

### అభివృద్ధే ఏజెండా.. ఉదయభాను

గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధే ఏజెండాగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతూ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఉదయభాను తెలిపారు. నియోజకవర్గంలో ఈ నాలుగున్నరేళ్లలో సుమారు రూ.500 కోట్లతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. తాను చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోని టీడీపీ వారు అడుగడున కోర్టులకు వెళుతూ స్టేలు తీసుకువచ్చి అభివృద్ధి పనులను ఆటంకపరుస్తున్నారన్నారు. ముస్లింలకు ఎంతో కాలంగా షాదీఖానా లేక ఇబ్బందులు పడుతుండగా, ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా పట్టణ నడిబొడ్డులో కోట్లాది రూపాయల విలువైన స్థలంలో షాదీఖానాను నిర్మిస్తున్నామన్నారు. ఎవరెన్ని అవరోధాలు సృష్టించినా, ఇచ్చినమాటకు కట్టుబడి ముస్లింల కోసం షాదీఖానా నిర్మిస్తున్నానన్నారు. పేటలో మార్కెట్ యార్డు నుంచి హైవే వరకు రూ.7 కోట్లతో డబుల్ రోడ్డు , రూ.కోటితో హైవేపై బస్టాండ్ నిర్మాణం పనులను కూడా వచ్చే ఫిబ్రవరి చివరినాటికి పూర్తిచేసి ప్రారంభోత్సవం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బీఎస్.గౌసుల్లా ఆజం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మెహబూబ్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు రఫీ, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వక్ఫ్‌బోర్డు జిల్లా కార్యదర్శి షేక్ జుబేర్, షాదీఖానా ప్రెసిడెంట్ ఎక్బైజ్ బాషా, నియోజకవర్గ, పట్టణ మైనార్టీ అధ్యక్షులు రస్‌హుస్సేన్, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

### మండప నిర్మాణానికి స్థల పరిశీలన



జగ్గయ్యపేట: పట్టణంలో వేంచేసియున్న శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం (పెద్దశివాలయం)లో కాలక్షేప మండపం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని దేవాదాయశాఖ డీఈ ఎం.రాజు గురువారం పరిశీలించారు. ఆలయ చైర్మన్ గెల్లా పూర్ణచంద్రరావు, ఇన్‌చార్జి ఈవో జయప్రకాష్ బాబుతో కలిసి ఆలయప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలించామన్నారు. మండపం నిర్మాణానికి సిజీఎఫ్ నిధులు రూ.60లక్షలు మంజూరయ్యాయన్నారు. మండప నిర్మాణపనులను త్వరలోనే చేపడతామని వివరించారు. ఏఈ కుమార్, స్థపతి సతీష్ పాల్గొన్నారు.

### టిడ్కో గృహాల వద్ద పనుల పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని టిడ్కో గృహాలను త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. స్థానిక బలుసుపాడు రోడ్‌లో ఉన్న టిడ్కో గృహాల వద్ద చేపట్టిన ఫ్లోరింగ్, డ్రైనేజీ, నీటి పైపులైన్, విద్యుద్దీకరణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మార్కెట్ యార్డు చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, కౌన్సిలర్ వట్టెం మనోహర్ ఉన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నందిగామ టౌన్: కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హతగల ప్రతి ఒక్కరికీ ఇంటిస్థలం, ఇళ్లు, పింఛను తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అందిస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు తెలిపారు. నందిగామ పట్టణంలోని మూడోవార్డులో గురువారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ దేశచరిత్రలో ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ పూర్తిగా నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. అన్నివర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న ఘనత తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. నందిగామ పట్టణాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానని వివరించారు. ఏఎంసీ చైర్మన్ షేక్ మస్తాన్, కౌన్సిలర్ ఖాలిక్, కోఆప్షన్ సభ్యులు జాఫర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

# ప్రయాణికులకు బహుమతులు

జగ్గయ్యపేట అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ వారు ప్రయాణికుల కోసం ప్రవేశపెట్టిన బహుమతి పథకం(గిఫ్ట్ స్కీమ్) ద్వారా పలువురు ప్రయాణికులు బహుమతులు గెలుచుకున్నట్లు పేట డిపో మేనేజర్ ఎం.రఘురాం తెలిపారు. పేట డిపో పరిధిలో జగ్గయ్యపేట–వైరా, పెనుగంచిప్రోలు–విజయవాడ రూట్‌లో రెండు వారాల పాటు ప్రయాణించిన ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ద్వారా ప్రయాణికులు, విద్యార్థుల సమక్షంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. డ్రాలో వైరా రూటులో ప్రథమ, ద్వితీయ బహుమతులను జగ్గయ్యపేటకు చెందిన జి.సత్యావతి, కె.రవి గెలుచుకోగా, పెనుగంచిప్రోలు రూటులో పెనుగంచిప్రోలుకు చెందిన డి.ఆంజనేయులు, విజయవాడకు చెందిన బి.సాంబశివరావు బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఈనెల 18వతేదీ మధ్యాహ్నం మూడుగంటలకు పేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో బహుమతులు అందజేయనున్నట్లు డీఎం తెలిపారు. డిపో సూపర్‌వైజర్లు, ట్రాఫిక్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



లక్కీ డ్రా తీయిస్తున్న డీఎం రఘురాం, ఉద్యోగులు

## రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

వత్సవాయి(పెనుగంచిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని కొనసాగిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి, ఎంపీపీ కె.రమాదేవి అన్నారు. వత్సవాయి మండలం పోలంపల్లి సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాలకు కూడిన డిస్‌ప్లే బోర్డును, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సచివాలయాల పరిధిలో లబ్ధిదారుల వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారని గుర్తుచేశారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడా గమనించి తిరిగి జగనన్నకు మద్దతు పలకాలని గ్రామస్తులను కోరారు. సర్పంచ్ మాడుగుల లాజర్, పెంటాలవారిగూడెం సర్పంచ్ వడ్డే పరమయ్య, వైస్ ఎంపీపీ కాటేపల్లి రమాదేవి, సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గుత్తా శంకరరావు, నాయకులు సచివాలయాల మండల కన్వీనర్ నాగేంద్రరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పోలంపల్లిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ దేవమణి, ఎంపీపీ రమాదేవి

## గ్రామాల్లో పంట నష్టం లెక్కింపు



సుబ్బాయిగూడెంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో రామసుబ్బారెడ్డి, ప్రభాకర్

పెనుగంచిప్రోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలనువ్యవసాయ, రెవిన్యూశాఖ అధికారులు కలిసి పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. పంటనష్టం పరిశీలనలో భాగంగా సిబ్బంది ఈ–క్రాప్ నమోదైన పంటలను రైతులతో కలిసి పరిశీలించి నష్టం అంచనా వేస్తున్నారని పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల వ్యవసాయాధికారులు కె రామసుబ్బారెడ్డి, రవికుమార్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధానాలకు అనుగుణంగా నష్టం అంచనా వేస్తునట్లు చెప్పారు. పంట దెబ్బతిన్న రైతులందరికీ న్యాయం జరిగేలా పకడ్బందీగా నష్టం అంచనాలు లెక్కిస్తున్నట్లు తెలిపారు. తమ సిబ్బంది పంటపొలాల్లో క్షుణ్ణంగా పరిశీలించి పంటనష్టాన్ని అంచనా వేస్తున్నారని, పూర్తిస్థాయి పంటనష్టం నమోదు ప్రక్రియ రెండుమూడు రోజుల్లో పూర్తవుతుందని వివరించారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నా

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు(కంచికచర్ల): ప్రజలకు అన్నిరకాల మౌలికవసతులు కల్పిస్తూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నానని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. వీరులపాడు మండలం అల్లూరు, దొడ్డదేవరపాడు గ్రామాల్లో రూ.53లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన మౌలికవసతులు కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివసించే ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఇటీవల ఈ గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరడంతో ఈ మేరకు దొడ్డవరప్పాడుకు రూ.33లక్షలు, అల్లూరుకు రూ.20లక్షలు కేటాయించి పనులు ప్రారంభించామని చెప్పారు. రోడ్ల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. గత పాలకులు గ్రామాలను పట్టించుకోలేదన్నారు. ప్రజలు, అధికారుల ద్వారా గ్రామాల్లో ఆయా సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నానని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి బందెల రాణి, ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, ఎంపీపీ కోటేరు లక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు ఏకే సౌజన్య, షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ షేక్ షహనాజ్‌బేగం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవల రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యులు కోటేరు ముత్తారెడ్డి, వైస్ ఎంపీపీ మోండ్రు ఆదాం, మాజీ సర్పంచి కోటేరు సూర్యనారాయణరెడ్డి ఉపసర్పంచి బి.నాగేశ్వరరావు, కుంపటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అల్లూరులో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



## బాధిత రైతులందరికీ పరిహారం



పెండ్యాల(కంచికచర్ల) : ఇటీవల సంభవించిన తుపాను కారణంగా నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. మండలంలోని పెండ్యాలలో తుపాను కారణంతో దెబ్బతిన్న పత్తి, వరి పంటలను గురువారం ఆయన పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. వ్యవసాయ అధికారుల సూచనల మేర పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు.



## 22న బీసీ సంక్షేమ సంఘం సభ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం సభ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 22వ తేదీన నిర్వహించనున్నామని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ తెలిపారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం నగర యువజన అధ్యక్షుడిగా పీసా అరుణ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కనిశెట్టి లక్ష్మణరావు అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీల సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 22వ తేదీన సంఘం ఆధ్వర్యంలో బీసీల రథయాత్ర చిట్టినగర్ సెంటర్ నుంచి ప్రారంభమై తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. కళాక్షేత్రంలో నిర్వహించే సభకు బీసీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.



## పోషకాహారం పంపిణీకి ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు:అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నాతో రెండు రోజులుగా మూతపడిన అంగన్‌వాడీ కేంద్రాలను తహశీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి గురువారం తెరిపించారు. పెనుగంచిప్రోలులోని తుపానుకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని సరుకులను పంచనామా చేసి సచివాలయ సిబ్బందికి అప్పగించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ చేసేందుకు ఇబ్బందులు లేకుండా ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం పంపిణీ సజావుగా సాగేలా ఏర్పాట్లు చేసినట్లు వారు వివరించారు. వైద్యాధికారి పి.ఇందిర, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి, ఆర్ఐ జనార్దనరావు, వీఆర్వోలు చైతన్య, లక్ష్మి, బేబి, కార్యదర్శి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



సరుకుల వివరాలు నమోదును పర్యవేక్షిస్తున్న తహశీల్దార్ లక్ష్మీకల్యాణి, సీడీపీవో లక్ష్మీభార్గవి